క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం భజనలు, రాత్రి స్వామికి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

'జగనన్న సురక్ష' ప్రయోజనకరం



సర్వేలో పాల్గొన్న ఎంఈఓ వసంతకుమారి

కొడవలూరు: ప్రజలందరికీ ప్రయోజనకరంగా ఉండేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టినట్లు ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. మండలంలోని రామాపురంలో జగనన్న సురక్షలో భాగంగా ఇంటింటి సర్వేను గురువారం నిర్వహించగా, ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా కొన్ని సాంకేతిక కారణాలతో పథకాలందని అరకొర లబ్ధిదారులకు కూడా మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా వివిధ రకాల సర్టిఫికెట్‌లను ఇంటి వద్దే అందిస్తారని వివరించారు. ఆమె వెంట సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు ఉన్నారు.

అలరించిన పాటలు, నృత్య పోటీలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో అరిగెపూడి విజయకుమార్ సంగీతోత్సవాన్ని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. బాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సీనియర్ గాయకులు సుజాత, దుర్గం మధుసూదన్, కరుణకుమార్, కృష్ణయ్య, తదితరులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. పాటలు, నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం కాలేషా, రఘురామిరెడ్డి, గోవర్ధన్‌ను సత్కరించారు. వాకాటి విజయకుమార్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, విశపు లలితారామ్, మెట్టు రామచంద్ర ప్రసాద్, ప్రదీప్, డ్యాన్స్ మాస్టర్ రమణయ్య, విశ్వేశ్వరప్రసాద్, బుజ్జయ్య, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు

నెల్లూరు(వేదాయపాళెం): ఆటోనగర్‌లోని ఏపీ మైనార్టీ గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నామని ప్రిన్సిపల్ కామేశ్వరి పేర్కొన్నారు. గురుకుల పాఠశాల ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాలను నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవాని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామేశ్వరి మాట్లాడారు. ఆసక్తి గల విద్యార్థులు ఆటోనగర్‌లోని గురుకుల పాఠశాలకు ఈ నెల 30వ తేదీలోపు స్పాట్ అడ్మిషన్లు పొందాలని కోరారు. వివరాలకు 94933 80898 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

- మౌలానా ఖాజీ ముస్తాక్ మదనీ

పొదలకూరు : త్యాగానికి ప్రతీక బక్రీద్ అని జామ్యా మసీదుకు చెందిన మౌలానా ఖాజీ ముస్తాక్ మదనీ సందేశం ఇచ్చారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా పట్టణానికి సమీపంలోని ఈద్గా వద్ద ముస్లింలు గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు మాట్లాడుతూ దైవ ఆదేశానుసారం బలిదానం చేసి త్యాగనిరతిని చాటుకున్నట్లు పేర్కొన్నారు. ఏ మత గ్రంథాలైనా పేదలను ఆదరించాల్సిందిగా సూచిస్తున్నట్లు తెలిపారు. త్యాగానికి, సేవానిరతికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ నాడు ప్రతి ముస్లిం పేదలకు సాయం చేయాలన్నారు. సొంత మతాన్ని ఆదరించడంతో పాటు ఇతర మతాలను గౌరవించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన తన్వీర్(593)కు మండల కో–ఆప్షన్ సభ్యుడు దస్తగిరి చేతులమీదుగా రూ.10 వేలు నగదు బహుమతిని అందజేశారు.

భక్తిశ్రద్ధలతో..

వెంకటాచలం: మండల పరిధిలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రమైన వెంకటాచలంతో పాటు కసుమూరు, సర్వేపల్లి తదితర గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

త్యాగం, కరుణ పెంపొందించేదే బక్రీద్

కొడవలూరు: త్యాగం, భక్తి, కరుణ, విశ్వాసం గుణాలను పెంపొందించేదే బక్రీద్ పండగ అని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. నార్తురాజుపాళెం దిన్నె ముస్లిం యూత్ అధ్యక్షుడు సయ్యద్ రఫీ స్థానిక వీసీఆర్ అతిథి గృహంలో చలపతిరావుకు గురువారం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లాహ్ దయతో ముస్లింలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



బుచ్చిరెడ్డిపాళెం: ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



వెంకటాచలం : ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు

➡ బుచ్చిరెడ్డిపాళెం: మండల పరిధిలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని ఖాజానగర్‌లో ఉన్న ఏ ఆల్ అమీన్ మజీద్ ప్రాంగణంలో పెద్దసంఖ్యలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు.



పొదలకూరు : ఈద్గా వద్ద విద్యార్థికి నగదు అందజేస్తున్న మత పెద్దలు

➡ ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు, గంగపట్నం, కుడితిపాళెం, కొరుటూరు, కొత్తూరు తదితర గ్రామాల్లోని మసీదుల్లో పెద్దఎత్తున ముస్లింలు బక్రీద్‌ను జరుపుకున్నారు. మతపెద్ద దైవసందేశం వినిపించగా, ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జిల నియామకం



బి.సురేష్‌కుమార్‌రెడ్డి



ఎం.వెంకటశేషయ్య



కె.చంద్రశేఖర్‌రెడ్డి



ఎన్.శివప్రసాద్



టి.సురేంద్రబాబు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పొదలకూరు మండలానికి బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వెంకటాచలానికి మందల వెంకటశేషయ్య, మనుబోలుకు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముత్తుకూరుకు నెల్లూరు శివప్రసాద్, తోటపల్లిగూడూరుకు తలమంచి సురేంద్రబాబులను నియమించారు. వీరంతా కొంతకాలంగా సచివాలయాల మండల కన్వీనర్లుగా కొనసాగుతూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారు.

కోవూరు నియోజకవర్గానికి..



కె.ప్రసాద్



కె.నవీన్‌కుమార్‌రెడ్డి



కె.శ్రీనివాసులురెడ్డి



వెంకటరమణయ్య



బి.వినోద్‌కుమార్

కోవూరు : కోవూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఐదు మండలాలకు సచివాలయ కన్వీనర్లను పార్టీ అధిష్టానం గురువారం అధికారికంగా ప్రకటించింది. కోవూరుకు కవరగిరి ప్రసాద్, విడవలూరుకు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, ఇందుకూరుపేటకు బందిల వెంకటరమణయ్య, కొడవలూరుకు కొండా శ్రీనివాసులురెడ్డి, బుచ్చిరెడ్డిపాళేనికి బల్లి వినోద్‌కుమార్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి మోర్ల మురళిలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషిచేస్తామని, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి పాటుపడుతామని వెల్లడించారు.



ఎం.మురళి

ఎస్సైల బాధ్యతల స్వీకరణ



మనుబోలు : బాధ్యతలు చేపట్టిన అజయ్‌కుమార్

మనుబోలు : మనుబోలు నూతన ఎస్సైగా జి.అజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎస్సైగా ఉన్న ముత్యాలరావు బదిలీపై వీఆర్‌కు వెళ్లగా వీఆర్‌లో ఉన్న అజయ్‌కుమార్ మనుబోలు ఎస్సైగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. మండల పరిధిలో 13 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉన్నందున వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. హైవేపై ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు ఎస్సైను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇందుకూరుపేట ఎస్సైగా రాజ్‌కుమార్

ఇందుకూరుపేట: మండలానికి నూతన ఎస్సైగా ఎం.రాజ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు. ప్రజా సమస్యలను చట్టప్రకారం పరిష్కరించేలా కృషి చేస్తానని ఎస్సై పేర్కొన్నారు.

3న మోటార్ బైక్ వేలం

కొడవలూరు: కోవూరు ఎస్‌ఈబీ(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) స్టేషన్ వద్ద టీవీఎస్ రైడర్ మోటార్ బైక్‌ను వచ్చే నెల 3వ తేదీన బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ఆర్.నరహరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మోటార్ సైకిల్ ధరను ప్రభుత్వం రూ.47 వేలుగా నిర్ణయించిందన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు 3వ తేదీ ఉదయం 10.30 గంటలకు కోవూరు ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద జరిగే వేలంలో పది శాతం ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చని సూచించారు.

వైభవంగా తొలి ఏకాదశి



పొదలకూరు : వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పొదలకూరు : పట్టణంలోని లక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్వామి మూలవిరాట్‌కు అభిషేకం, 9 గంటలకు విష్ణుసహస్ర నామార్చన, సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, 7.30 గంటలకు పల్లకిసేవ గావించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అయ్యప్పనగర్‌లో..

పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా..

మనుబోలు : మండల కేంద్రంలోని విష్ణాలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు హనుమాచార్యులు శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామికి మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉభయకర్తలుగా పాశం నాగరాజు–లావణ్య దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను పెనుగొండ సుధాకర్, ముంగర ధనుంజయరెడ్డి, కసుమూరు రామసుబ్బారెడ్డి తదితరులు పర్యవేక్షించారు.



మనుబోలు : ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ

➡ ఇందుకూరుపేట : తొలిఏకాదశి పర్వదినాన్ని మండల వాసులు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెలుగు సంవత్సరాదిలో వచ్చే తొలి పండగ కావడంతో ప్రజలు తలంటు స్నానాలు ఆచరించి వాకిళ్లకు పచ్చని తోరణాలు కట్టి ఇష్టదైవాలకు పూజలు చేశారు. పిండి వంటలు చేసుకుని సంతోషంగా గడిపారు. ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. దీంతో గ్రామాల్లో పండగ వాతావారణం నెలకొంది.

ఎన్‌ఎస్సార్ ట్రస్టు ద్వారా ట్రైసైకిళ్ల వితరణ

కోవూరు : మండల కేంద్రంలోని ఇద్దరు దివ్యాంగులకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రెండు బ్యాటరీ ట్రైసైకిళ్లను గురువారం వితరణగా అందజేశారు. ఇటీవల కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న సమయంలో కోవూరు 3, 5 సచివాలయాల పరిధిలో ఇద్దరు దివ్యాంగులు ట్రై సైకిళ్లు అందజేయాలని అభ్యర్థించారు. తక్షణమే స్పందించిన ఆయన రోజుల వ్యవధిలో వారికి ట్రై సైకిళ్లు సమకూర్చారు. వీటిని మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి చేతుల మీదుగా దివ్యాంగులైన గండవరపు గోపిశంకర్, ఏనాటి సుదర్శన్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, సచివాలయ కన్వీనర్ ప్రసాద్, నేతలు వెంకటరమణారెడ్డి, నాగరాజు, శివకుమార్‌రెడ్డి, స్థానిక శివాలయ చైర్మన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాటరీ ట్రైసైకిళ్లను అందజేస్తున్న నిరంజన్‌బాబురెడ్డి, రాధాకృష్ణారెడ్డి

వీఆర్‌ఏల నూతన కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(పొగతోట): గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటశివయ్య, భానుచందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వీఆర్‌ఏల సమావేశానికి ఏపీఆర్‌ఎస్‌ఏ నేత బొబ్బాల మురళి, వీఆర్‌ఏల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య హాజరయ్యారు. అనంతరం వీఆర్‌ఏల సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, రాజేష్, కార్యదర్శిగా ప్రేమదాస్, కోశాధికారిగా కేశవరావును ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా రవీంద్ర, అమీర్, అశోక్, చిన్న అంకయ్య ఎన్నికయ్యారు.

దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు



ఇందుకూరుపేట : మండలంలోని లేబూరు గ్రామంలో కొలువైన కుంకాళమ్మ ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాల నడుమ ఊరేగుతున్న అమ్మవారికి గ్రామస్తులు కొబ్బరికాయ, కర్పూర హారతులు పట్టి స్వాగతం పలికారు. గ్రామోత్సవానికి ఉభయదాతలుగా తూర్పువీధి యూత్ వారు వ్యవహరించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

రామాపురంలో ఏకలవ్యుని జయంతి



ఏకలవ్యుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైహెచ్‌పీఎస్ సభ్యులు

కొడవలూరు: మండలంలోని రామాపురంలో ఏకలవ్యుని జయంతిని వైహెచ్‌పీఎస్ (ఎరుకుల హక్కుల పోరాట సమితి) ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ మాట్లాడుతూ గురువైన ద్రోణాచార్యుని మాటకు విలువనిచ్చి తన బొటని వేలును గురుదక్షిణగా ఇచ్చిన ఏకలవ్యుడు ఎంతో గొప్పవాడన్నారు. కార్యక్రమంలో ఆ సమితి జిల్లా చైర్మన్ కట్టా రమణయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసా రాజ్‌కుమార్, కుంభ మణి, సభ్యులు ఎన్.వెంకయ్య, డి.కాటయ్య, బి.నాగరాజు, డి.శ్రీరాములు, డి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.